క్లుప్తంగా

నేటి నుంచి మహాశివరాత్రి ఉత్సవాలు


ఉత్సవాల బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న దృశ్యం

కవాడిగూడ: భోలక్‌పూర్ డివిజన్ దేవునితోటలోని భవానీశంకర్ ఆలయంలో ఈ నెల 17 నుంచి 19వ వరకు మహాశివరాత్రి మహోత్సవాలను వైభవంగా నిర్వహిస్తున్నట్లు దేవాదాయ శాఖ సికింద్రాబాద్ అసిస్టెంట్ కమిషనర్ బి.కృష్ణ, దేవాలయ కార్యనిర్వహణాధికారి బి.జ్యోతి, ఆలయ మాజీ చైర్మన్ ఆర్.శ్రీనివాస్ తెలిపారు. ఈ మేరకు గురువారం దేవాలయంలో ఉత్సవాలకు సంబంధించిన బ్రోచర్‌ను ఆవిష్కరించారు. నేడు ఉదయం 5 గంటలకు ప్రారంభమయ్యే మహోత్సవాలకు ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ హాజరై పట్టు వస్త్రాలు సమర్పిస్తారని వెల్లడించారు. కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, స్థానిక కార్పొరేటర్ గౌసుద్దీన్ ఈ వేడుకల్లో పాల్గొంటారని చెప్పారు.

కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లండి

నల్లకుంట: ప్రధాని మోదీ నాయకత్వంలో కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజా సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దుగ్యాల ప్రదీప్ కార్యకర్తలకు సూచించారు. బీజేపీ పాత నల్లకుంట 1, 2, 3 శక్తి కేంద్రాల ప్రముఖ్ ఎం.మధుయాదవ్ అధ్యక్షతన బుధవారం రాత్రి నల్లకుంట పాత రామాలయం సర్కిల్‌లో బీజేపీ శక్తి కేంద్రం కార్నర్ సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా ప్రదీప్ హాజరై కార్యకర్తలకు దిశా నిర్దేశం చేశారు. సమావేశంలో నల్లకుంట కార్పొరేటర్ అమృత, బీజేపీ హైదరాబాద్ సెంట్రల్ జిల్లా కార్యదర్శి నాయిని బుచ్చిరెడ్డి, నాయకులు శ్యామ్‌రాజ్, రమణానాయుడు, ప్రశాంత్ జోషి తదితరులు పాల్గొన్నారు.

కలుషిత నీటి సమస్యను పరిష్కరించండి


చెప్పల్‌బజార్‌లో పర్యటిస్తున్న కార్పొరేటర్ ఉమారమేష్‌యాదవ్

కాచిగూడ: చెప్పల్‌బజార్‌లో కలుషిత నీరు సరఫరా అవుతోందని, వెంటనే సమస్యను పరిష్కరించి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలని కాచిగూడ కార్పొరేటర్ కన్నె ఉమారమేష్‌యాదవ్ జలమండలి అధికారులకు సూచించారు. గురువారం కాచిగూడ డివిజన్ పరిధిలోని చెప్పల్‌బజార్‌లో ఆమె అధికారులతో కలిసి పర్యటించారు. డ్రైనేజీ పైపులైన్లు నిండిపోయి తాగునీరు కలుషితం అవుతోందని స్థానికులు కార్పొరేటర్‌కు ఫిర్యాదు చేయగా, తక్షణమే డ్రైనేజీ లైన్లకు మరమ్మతులు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో జలమండలి ఏఈ గాజుల భావన, వర్క్ ఇన్‌స్పెక్టర్ వెంకటేష్‌యాదవ్, బీజేపీ నేతలు భీంరాజ్, రవియాదవ్, సంతోష్, బాలప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

కాలుష్య రహితంగా శోభాయాత్ర నిర్వహించాలి

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: ఛత్రపతి శివాజీ మహరాజ్ జయంతి సందర్భంగా ఈ నెల 19న సాయంత్రం మోతీనగర్ నుంచి బోరబండ వరకు చేపట్టనున్న శోభాయాత్రను కాలుష్య రహితంగా నిర్వహించాలని ఎన్విరాన్‌మెంటల్ ప్రొటెక్షన్ అండ్ డెవలప్‌మెంట్ కౌన్సిల్ నిర్వాహకులకు విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు గురువారం కౌన్సిల్ గౌరవ అధ్యక్షుడు ఉప్పల వెంకటేష్‌గుప్తా, వ్యవస్థాపక అధ్యక్షుడు రంగయ్య తదితరులు ఓ ప్రకటన విడుదల చేశారు. శోభాయాత్రలో మోటారు వాహనాలు వినియోగించొద్దని కోరారు. వాహనదారుల రాకపోకలకు ఇబ్బందులు తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

మార్చిలో పీజీ కోర్సుల పరీక్షలు

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ పరిధిలో వివిధ పీజీ రెగ్యులర్ కోర్సుల మొదటి సెమిస్టర్ పరీక్షలు ప్రారంభంకానున్నట్లు ఎగ్జామినేషన్ కంట్రోలర్ ప్రొ.రాములు పేర్కొన్నారు. క్యాంపస్ కాలేజీలతో పాటు అనుబంధ, ప్రైవేటు పీజీ కాలేజీలో కొనసాగుతున్న ఎంఏ, ఎంకాం, ఎమ్మెల్సీ, జర్నలిజం, లైబ్రరీ సైన్స్, సోషల్ వర్క్ రెగ్యులర్ పీజీ కోర్సులతో పాటు నిజాం కాలేజీలోని ఐదేండ్ల ఎమ్మెస్సీ కెమిస్ట్రీ కోర్సుల మొదటి సెమిస్టర్ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు ఈ నెల 28 వరకు, రూ.300 అపరాధ రుసుంతో వచ్చే నెల 13 వరకు ఫీజు చెల్లించాలన్నారు.

ఓయూలో పుస్తకాల పంపిణీ

ఉస్మానియా యూనివర్సిటీ: సీఎం కేసీఆర్ పుట్టిన రోజు పురస్కరించుకొని ఓయూలో ఉద్యోగ పోటీ పరీక్షలకు చదివే అభ్యర్థులకు పుస్తకాలను పంపిణీ చేశారు. గురువారం ఆర్ట్స్ కాలేజీ ఎదుట బీఆర్‌ఎస్వీ రాష్ట్ర ఉపాధ్యక్షులు తుంగ బాలు ఆధ్వర్యంలో ది వ్యాంగులు, నిరుద్యోగులకు పుస్తకాలు అందజేశారు.

కిషన్‌రెడ్డి హయాంలోనే అంబర్‌పేట అభివృద్ధి


సమావేశంలో మాట్లాడుతున్న గౌతంరావు

కాచిగూడ: బీజేపీ రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహిస్తున్న కార్నర్ మీటింగ్స్‌కు ప్రజల నుంచి వస్తున్న స్పందన చూసి బీఆర్‌ఎస్ పార్టీకి దిమ్మతిరిగిపోతోందని ఆ పార్టీ హైదరాబాద్ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎన్.గౌతంరావు అన్నారు. తమ పార్టీపై, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డిపై మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ చేసిన అనుచిత వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు. గురువారం బర్కత్‌పురాలోని బీజేపీ నగర కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కార్పొరేటర్లు కన్నె ఉమారమేష్‌యాదవ్, వై.అమృత, బి.పద్మావెంకట్‌రెడ్డితో కలిసి ఆయన మాట్లాడారు. అంబర్‌పేటలో కిషన్‌రెడ్డి ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో జరిగిన అభివృద్ధి, బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో జరిగిన అభివృద్ధిపై మంత్రి తలసాని, ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ బహిరంగ చర్చకు రావాలని ఆయన సవాల్ చేశారు. అంబర్‌పేట నియోజకవర్గంలో కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి చేసిన పాదయాత్రలో ప్రజలు అనేక సమస్యలు ఏకరువు పెట్టారన్నారు. ఆయన ఎమ్మెల్యేగా లేకపోవడంతో కనీసం తాగునీరు సరిగా రావడం లేదని, నూతన పింఛన్లు, రేషన్ కార్డులు మంజూరు కావడం లేదని, డబుల్ బెడ్‌రూం ఇళ్లు కాగితాలకే పరిమితమయ్యాయని ప్రజలు మొరపెట్టుకున్నట్లు తెలిపారు. కిషన్‌రెడ్డి నిత్యం ప్రజల్లో ఉండే వ్యక్తి అని, అంబర్‌పేటలో అభివృద్ధి జరిగిందంటే అది ఆయన హయాంలోనే అని గౌతంరావు పేర్కొన్నారు. ఆయన ప్రభుత్వ స్థలాల్లో కమ్యూనిటీహాళ్లు, పాఠశాలలు నిర్మించారని, బీఆర్‌ఎస్ నేతలు మాత్రం ప్రభుత్వ భూములు కనిపిస్తే కబ్జాలకు పాల్పడుతున్నారని ఆయన మండిపడ్డారు.

దళితుల అభ్యున్నతికి శ్రమించే వ్యక్తి కేసీఆర్


కేక్ కట్ చేసి వేడుకలు నిర్వహిస్తున్న దళిత సంఘాల నాయకులు

కవాడిగూడ: దళితుల అభ్యున్నతి కోసం శ్రమించే వ్యక్తిగా సీఎం కేసీఆర్ చరిత్రలో నిలిచిపోతారని మాదిగ హక్కుల దండోరా, మాదిగ సంఘాల యునైటెడ్ ఫ్రంట్, ఎస్సీ ఉప కులాల ఐక్యవేదిక నాయకులు జన్ను కనకరాజు, సిద్దుల రామలింగం, కుక్కేర భూమన్న కొనియాడారు. గురువారం సంఘాల ఆధ్వర్యంలో లోయర్ ట్యాంక్‌బండ్‌లోని అంబేడ్కర్ విగ్రహం వద్ద సీఎం జన్మదిన వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నూతన సచివాలయానికి అంబేడ్కర్ పేరు పెట్టడం, 25 అడుగుల అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటు చేయడం, దళితబంధు పథకం వంటి నిర్ణయాలు అభినందనీయమన్నారు. తెలంగాణలో మాదిగలకు, ఉప కులాలకు తగిన రాజకీయ ప్రాధాన్యత కల్పించాలని, ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని సీఎం కేసీఆర్‌ను కోరారు. ఎస్సీ కమిషన్ చైర్మన్ పదవిని భర్తీ చేసి దళితులకు ఆత్మగౌరవ భవనం నిర్మించాలని వారు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో మల్లేష్, నర్సింహ, సాయినాథ్, శ్రీనివాస్, రమేష్, శేఖర్, రాకేష్, మధు, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

పద్మశాలీలు ఆర్థికంగా, రాజకీయంగా ఎదగాలి

ఎమ్మెల్సీ ఎల్.రమణ



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ రమణ

కాచిగూడ: పద్మశాలీలు రాజకీయంగా, సామాజికంగా, ఆర్థికంగా ఎదిగేందుకు ప్రయత్నించాలని ఎమ్మెల్సీ ఎల్.రమణ అన్నారు. గురువారం రాత్రి నారాయణగూడలోని పద్మశాలి భవన్‌లో అఖిల భారత పద్మశాలి సంఘం యువజన విభాగం జాతీయ అధ్యక్షుడిగా ఎన్నికైన ప్రథమేష్‌కుమార్‌తో పాటు నూతనంగా ఎన్నికైన జాతీయ కార్యవర్గ సభ్యులు ప్రమాణస్వీకారం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ రమణ మాట్లాడుతూ.. పద్మశాలీలు వ్యక్తిగతంగా అభివృద్ధి చెందడంతో పాటు అట్టడుగున ఉన్నవారిని ఆదుకోవాలని సూచించారు. సంఘం జాతీయ అధ్యక్షుడు కందగట్ల స్వామి మాట్లాడుతూ.. జాతీయ స్థాయిలో పద్మశాలీలను చైతన్యవంతులను చేసేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో శ్రీధర్ ఎస్.సుంకర్‌వార్, గడ్డం జగన్నాథం, పుట్ట పాండురంగయ్య, గుండేటి శ్రీధర్, అవ్వారు భాస్కర్, రామకృష్ణ కొండ్యాల్, జి.వి.నాగేశ్వర్‌రావు, మహేష్ విష్ణు పత్, కొంకతి కాళప్ప, రుద్ర భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

వలస కార్మికులకు అడ్డాగా తెలంగాణ

కవాడిగూడ: సీఎం కేసీఆర్ దూరదృష్టితో చేపట్టిన అనేక సంక్షేమ పథకాలతో ఇతర రాష్ట్రాల నుంచి వచ్చే వలస కార్మికుల జీవన భృతికి తెలంగాణ అడ్డాగా మారిందని తెలంగాణ అడ్వకేట్ జేఏసీ కన్వీనర్ పులిగారి గోవర్ధన్‌రెడ్డి అన్నారు. కవాడిగూడలోని అడ్వకేట్ జేఏసీ కార్యాలయంలో సీఎం జన్మదిన వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా పులిగారి గోవర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ.. పలు విదేశీ కంపెనీల పెట్టుబడులకు కేరాఫ్ అడ్రస్‌గా తెలంగాణ మారిందని, హైదరాబాద్ విశ్వనగరంగా మార్పు చెందుతోందని ఆయన పేర్కొన్నారు.

'సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం విఫలం'


సమావేశంలో మాట్లాడుతున్న కృష్ణగౌడ్

అంబర్‌పేట: ప్రజా సమస్యల పరిష్కారంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం విఫలమైందని, అంబర్‌పేట నియోజకవర్గంలో ఎక్కడి సమస్యలు అక్కడే పేరుకుపోయాయని బీజేపీ సెంట్రల్ జిల్లా ప్రధాన కార్యదర్శి కృష్ణగౌడ్ అన్నారు. గురువారం గోల్నాక డివిజన్‌లో బీజేపీ చేపట్టిన కార్నర్ మీటింగ్‌లో ఆయన మాట్లాడుతూ.. అంబర్‌పేట నియోజకవర్గంలో సమస్యలను పరిష్కరించడంలో అధికార యంత్రాంగం విఫలమవుతుందని విమర్శించారు. నియోజకవర్గంలో బూత్ స్థాయిలో పార్టీ పటిష్టతకు నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు రవీందర్‌గౌడ్ పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో చండీ హోమం


హోమం నిర్వహిస్తున్న అర్చకులు

నల్లకుంట: మూల నక్షత్రాన్ని పురస్కరించుకొని గురువారం న్యూ నల్లకుంటలోని సీతారామాంజనేయ సరస్వతి ఆలయం భక్తులతో పోటెత్తింది. ఉదయం జ్ఞాన సరస్వతి మాతను పట్టు వస్త్రాలు, పూలతో అలంకరించి ప్రత్యేక పూజలు, కుంకుమార్చనలు చేశారు. అనంతరం ఆలయ ప్రాంగణంలోని యాగశాలలో చండీ హోమం నిర్వహించారు. ఈ సందర్భంగా నవధాన్యాలు, సుగంధ ద్రవ్యాలు హోమంలో వేసి ఆవు నెయ్యితో పూర్ణాహుతి కావించారు.

కార్పొరేటర్ అమృతకు శుభాకాంక్షలు

నల్లకుంట: బల్దియాలో బీజేపీ పక్ష కార్యదర్శిగా నల్లకుంట కార్పొరేటర్ వై.అమృత నియమితులైన సందర్భంగా గురువారం పలువురు బీజేపీ నేతలు ఆమెను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఆమె మాట్లాడుతూ.. అధికార పార్టీ వైఫల్యాలపై రాజీలేని పోరాటం చేస్తామన్నారు. బీజేపీ హైదరాబాద్ సెంట్రల్ జిల్లా ఎస్సీ మోర్చా ఉపాధ్యక్షుడు లక్ష్మణ్‌కుమార్, సెంట్రల్ జిల్లా ఎగ్జిక్యూటివ్ మెంబర్ కేజే బాబు, మైనార్టీ మోర్చా మహిళా నాయకురాలు ఇర్ఫాణ సుల్తాణ, జ్యోతి కార్పొరేటర్‌ను కలిసి సన్మానించారు.



ప్రజలకు నాణ్యమైన విద్యుత్ అందిస్తున్నాం



మాట్లాడుతున్న ప్రభాకర్‌రావు

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: నాణ్యమైన విద్యుత్ అందించడంలో తెలంగాణ దేశంలోనే ప్రథమ స్థానంలో ఉందని సీపీడీసీఎల్, జెన్‌కో సిఎండీ దేవులపల్లి ప్రభాకర్‌రావు అన్నారు. గురువారం సుందరయ్య విజ్ఞానకేంద్రంలో తెలంగాణ ఎలక్ట్రిక్ సిటీ ఎస్‌ఈ, ఎస్‌టీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ 13వ వార్షికోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ డైరీ, కేలండర్‌ను ప్రభాకర్‌రావు ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. విద్యుత్ సంస్థలను లాభాల బాటలోకి తీసుకొచ్చేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. తెలంగాణ ఏర్పాటుకు ముందున్న పరిస్థితికి, ఇప్పుడున్న పరిస్థితికి తేడా ఏంటో స్పష్టంగా తెలుస్తుందన్నారు. నిరంతరం నాణ్యమైన విద్యుత్ అందిస్తూ ప్రజల మన్ననలు పొందుతున్నామన్నారు. కార్యక్రమంలో ఎస్‌పీడీసీఎల్ సీఎండీ రఘుమారెడ్డి, తెలంగాణ ఎలక్ట్రిక్ సిటీ ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయిస్ అసోసియేషన్ వ్యవస్థాపక కార్యదర్శి మాతంగి శ్రీనివాస్, మాజీ ఎమ్మెల్యే ఆరెపల్లి మోహన్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ సేవాభావం అలవర్చుకోవాలి


విద్యార్థులకు నోట్ బుక్స్, పండ్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే

కవాడిగూడ: ప్రతి ఒక్కరూ సేవా భావాన్ని అలవర్చుకోవాలని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ అన్నారు. గురువారం ముషీరాబాద్ ప్రభుత్వ పాఠశాలలో బీఆర్‌ఎస్ నగర యువజన విభాగం సీనియర్ నాయకుడు రవీంద్ర కోక ఆధ్వర్యంలో విద్యార్థులకు నోట్ బుక్స్, పండ్లు పంపిణీ చేశారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే ముఠా గోపాల్ మాట్లాడుతూ.. పేదలను ఆదుకునేందుకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని కోరారు. విద్యార్థులు బాగా చదువుకుని ఉన్నతంగా ఎదగాలని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎం.నరేందర్‌యాదవ్, ముచ్చకుర్తి ప్రభాకర్, శంకర్, ఆంజనేయులు, కృష్ణ, ప్రవీణ్, రాకేష్, శ్రీనివాస్‌గుప్తా, ఆలీ, శ్రీనివాస్, రాముగౌడ్, కిరణ్, ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

'బీజేపీ సభలను ప్రజలు పట్టించుకోవడం లేదు'


మాట్లాడుతున్న ఎంఎన్ శ్రీనివాస్‌రావు

ముషీరాబాద్: బీజేపీలో చేరిన నాయకులకే ఎలాంటి భరోసా లేదని, వారు ప్రజలకు ఏం భరోసా ఇస్తారని బీఆర్‌ఎస్ నేత ఎంఎన్ శ్రీనివాసరావు అన్నారు. బీజేపీ నాయకులు రాష్ట్రానికి, ప్రజలకు ఏం చేశారో చెప్పుకోలేక రాష్ట్ర ప్రభుత్వంపై విమర్శలు చేస్తున్నారని మండిపడ్డారు. గురువారం రాంనగర్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. బీజేపీ చేపడుతున్న బస్తీ సభలు వీధి భాగోతాలను తలపిస్తున్నాయని, ప్రజలు వారిని పట్టించుకోవడం లేదన్నారు. బీజేపీ కార్యకర్తలు తప్ప ఎక్కడా ప్రజలు వచ్చి తమకు సమస్యలు ఉన్నాయని, సంక్షేమ పథకాలు అందడం లేదని చెప్పడం లేదన్నారు. బీజేపీ నేతలు ప్రజలకు భరోసా ఇవ్వాలనుకుంటే పెట్రోల్ ధర తగ్గిస్తామని, 40 వేల లీటర్ల తాగునీరు, తెలంగాణ ప్రభుత్వం ఇస్తున్న సంక్షేమ పథకాల కంటే రెట్టింపు లబ్ధి కల్పిస్తామని చెప్పాలని డిమాండ్ చేశారు. శుక్రవారం సీఎం కేసీఆర్ జన్మదినం సందర్భంగా ముషీరాబాద్ నియోజకవర్గంలో పెద్ద ఎత్తున సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు మనోహర్‌సింగ్, అతినగరం సుదేష్, రజనీకాంత్‌గౌడ్, యూనీస్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా రోజ్ బర్డ్స్ హైస్కూల్ వార్షికోత్సవం


వేడుకల్లో పాల్గొన్న పాఠశాల మేనేజింగ్ డైరెక్టర్ శ్రీకాంత్‌రెడ్డి, ఉపాధ్యాయులు

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: అంబర్‌పేట మల్లికార్జుననగర్‌లోని రోజ్ బర్డ్స్ హైస్కూల్ 35వ వార్షికోత్సవాన్ని గురువారం బాగ్‌లింగంపల్లిలోని ఆర్టీసీ కల్యాణమండపంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలతో సందడి చేశారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న హైస్కూల్ మేనేజింగ్ డైరెక్టర్ కె.శ్రీకాంత్‌రెడ్డి మాట్లాడుతూ.. తమ పాఠశాలలో విద్యతో పాటు ఆటపాటల్లోనూ మంచి శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. శారీరక ఉల్లాసం కోసం నిర్వహించే క్రీడలు, చిత్ర లేఖనం, నృత్యం తదితర అంశాలు విద్యార్థుల్లో సృజనాత్మకతను పెంచుతాయన్నారు. అకడమిక్ డైరెక్టర్ కె.రూపారెడ్డి, టెక్నికల్ డైరెక్టర్ కె.కౌశిక్‌రెడ్డి, పాఠశాల ప్రిన్సిపాల్ జి.చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

క్రీడా పోటీల విజేతలకు బహుమతులు అందజేత


విజేతలకు బహుమతులు అందజేసిన ఎంపీ లక్ష్మణ్

చిక్కడపల్లి: ప్రధాని నరేంద్ర మోదీ క్రీడలకు ప్రాధాన్యత ఇస్తున్నారని బీజేపీ ఎంపీ డాక్టర్ కె.లక్ష్మణ్ అన్నారు. గురువారం చిక్కడపల్లి జనతా పార్క్ మైదానంలో కిరణాలు సంక్షేమ సంఘం అధ్యక్షురాలు, మాజీ కార్పొరేటర్ టి.శైలజాగోపాల్ ఆధ్వర్యంలో నిర్వహించిన క్రీడాపోటీల విజేతలకు ఆయన బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా లక్ష్మణ్ మాట్లాడుతూ.. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో మన క్రీడాకారులు రాణిస్తున్నారన్నారు. మన చుట్టూ ఉన్న మైదానాలు, పార్కులను కాపాడుకోవాల్సిన అవసరం ఉందని ఆయన అన్నారు. కార్యక్రమంలో బీజేపీ మహంకాళి జిల్లా ఉపాధ్యక్షురాలు అరుణాజయేందర్‌బాబు, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు టి.గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

టీబీఎస్‌ఎస్ ఉపాధ్యక్షుడు రంగారావుకు జన్మదిన శుభాకాంక్షలు


రంగారావును సన్మానిస్తున్న రమణారావు తదితరులు

నల్లకుంట: తెలంగాణ బ్రాహ్మణ సేవా సమితి (టీబీఎస్‌ఎస్) రాష్ట్ర ఉపాధ్యక్షుడు దేవులపల్లి రంగారావు జన్మదిన వేడుకలు గురువారం నల్లకుంటలోని సమితి కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా సమితి రాష్ట్ర అధ్యక్షుడు పోచంపల్లి రమణారావు ఆయనకు శాలువా కప్పి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో సమితి రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు మంత్రి సునీల్, సహాయ కార్యదర్శి దేవులపల్లి అశోక్‌కుమార్, కార్యవర్గ సభ్యుడు గుండమరాజు తదితరులు పాల్గొన్నారు.

ఆశా వర్కర్ల సమస్యలు పరిష్కరించాలని ధర్నా



కవాడిగూడ: రాష్ట్ర వ్యాప్తంగా పని చేస్తున్న ఆశా వర్కర్లకు ఫిక్స్‌డ్ వేతనం నిర్ణయించాలని, వారు ఎదుర్కొంటున్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి భూపాల్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆశా వర్కర్లకు ఇతర రాష్ట్రాల్లో ఇస్తున్న విధంగా రూ.10 వేల వేతనం చెల్లించాలని డిమాండ్ చేస్తూ గురువారం ఇందిరాపార్కు వద్ద సీఐటీయూ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో దాదాపు 26 వేల మంది ఆశా వర్కర్లు పని చేస్తున్నారని, వారికి పెన్షన్, ఈఎస్‌ఐ సదుపాయాలు కల్పించి ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. ఈ ధర్నాలో 33 జిల్లాల నుంచి పెద్ద సంఖ్యలో అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు. రాష్ట్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ తమ న్యాయమైన డిమాండ్ల పరిష్కారానికి యుద్ధ ప్రాతిపదికన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి భూపాల్, రాష్ట్ర నాయకులు జె.వెంకటేష్, యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు పి.విజయలక్ష్మి, ప్రధాన కార్యదర్శి నీలాదేవి, కోశాధికారి పి.గంగమణి, జి.కవిత, హేమలత, సునీత తదితరులు పాల్గొన్నారు.

'జీవో నెం.6ను వెంటనే రద్దు చేయండి'


సమావేశంలో మాట్లాడుతున్న మల్లయ్య

కవాడిగూడ: సీఎం కేసీఆర్ తన పుట్టినరోజు అయినా సరే చేపల వృత్తి కేవలం గంగపుత్రులకు వర్తించే విధంగా చర్యలు తీసుకోవాలని తెలంగాణ ప్రదేశ్ గంగపుత్ర సంఘం అధ్యక్షుడు ఎ.ఎల్.మల్లయ్య కోరారు. అలా ప్రకటిస్తే తెలంగాణ వ్యాప్తంగా ఉన్న గంగపుత్రులంతా సీఎం కేసీఆర్ చిత్రపటాలకు పాలాభిషేకం చేస్తారన్నారు. గురువారం కవాడిగూడ బండమైసమ్మ నగర్‌లోని సంఘం కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. చేపలు పట్టే వృత్తి బెస్త, గంగపుత్ర, గూండ్ల కులస్థులదని స్వయంగా సీఎం కేసీఆర్ అసెంబ్లీలో ప్రకటించారని చెప్పారు. జీవో నెంబర్ 6ను వెంటనే రద్దు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. గొల్ల కురుమలకు గొర్రెలు ఇచ్చినప్పుడు, తాటి చెట్లు ఎక్కే గౌడలకు సొసైటీల్లో సభ్యత్వం ఇస్తున్నారని, మగ్గం నేసే పద్మశాలీలకు వారి సొసైటీల్లో వారికి మాత్రమే సభ్యత్వం ఇస్తున్నప్పుడు గంగపుత్రుల విషయంలో మాత్రం ఎలాంటి సంబంధం లేని ముదిరాజ్‌లకు మత్స్యకార సహకార సొసైటీల్లో ఎందుకు సభ్యత్వం కల్పిస్తున్నారని ఆయన ప్రశ్నించారు. సంఘం ప్రధాన కార్యదర్శి గడప శ్రీహరి, కోశాధికారి ఎర్రబోయిన మల్లేష్, కార్యదర్శి కె.హరి, బాలయ్య, చంద్రప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

'బీఆర్‌ఎస్‌తో దేశానికి మంచి రోజులు'


కేక్ కట్ చేసిన ప్రసన్నారామ్మూర్తి, అయోధ్య తదితరులు

చిక్కడపల్లి: రాష్ట్ర అభివృద్ధి కోసం అలుపెరగని పోరాటం చేస్తున్న సీఎం కేసీఆర్ అని నగర గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ కె.ప్రసన్నారామ్మూర్తి అన్నారు. గురువారం అశోక్‌నగర్‌లోని నగర కేంద్ర గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యంలో సీఎం కేసీఆర్ జన్మదిన వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్ పార్టీతో దేశానికి మంచి రోజులు వస్తాయన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర గ్రంథాలయ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు చాగంటి అయోధ్య, హెచ్‌సీజీఎస్ యూనిట్ కార్యదర్శి బొల్లం మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక ఇబ్బందులతో వ్యక్తి ఆత్మహత్య

శంషాబాద్: ఆర్థిక ఇబ్బందులతో వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన ఆర్‌జీఐఏ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. ఒడిశా రాష్ట్రానికి చెందిన రవీంద్రనాథ్‌శెట్టి(58) కొంత కాలంగా గగన్‌పహాడ్‌లోని సత్యం శివం సుందరం గోశాలలో లేబర్ సూపర్‌వైజర్‌గా పనిచేస్తున్నాడు. ఆర్థిక ఇబ్బందులతో మనస్తాపం చెందిన అతడు బుధవారం రాత్రి తన గదిలో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఉదయం ఇతర ఉద్యోగులు చూసి పోలీసులకు సమాచారం అందించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.